గొల్లపూడి కాల్వకు గండ్లు


అంబాపురం వద్ద గొల్లపూడి కాల్వకు పడిన గండి


అధ్వానస్థితిలో పాముల కాల్వ వంతెన ప్రాంతం

- పూడ్చితేనే రెండవ పంట సాగు
- కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడ

విజయవాడరూరల్: గత నెలలో సంభవించిన వరదల కారణంగా గొల్లపూడి పంపింగ్ స్కీమ్ మోటార్లు తడిసిపోయి కృష్ణానది నుంచి నీరు తోడే వీల్లేకుండా ఉన్నాయి. అంతేకాక పంట కాల్వకు అనేక చోట్ల గండ్లు పడ్డాయి. కాల్వలో దట్టంగా తూటుకాడ పెరిగిపోయింది. పాముల కాల్వ వద్ద సైఫన్ గోడ విరిగి పడింది. ఆ గోడ నిర్మిస్తే తప్ప కాల్వ శివారు భూములకు నీరు అందే పరిస్థితి లేదు. ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) ఆధ్వర్యంలో పని చేసే ఈ పంట కాల్వ గొల్లపూడి గ్రామం నుంచి ముస్తాబాదు గ్రామం వరకు దాదాపు 14వేల ఎకరాల వ్యవసాయ భూముల ఆయకట్టుకు సాగునీరు అందించే అతి పెద్ద ఎత్తిపోతల పథకం. గొల్లపూడి, భవానీపురం, విద్యాధరపురం, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, విలేజి కండ్రిక, నున్న, ముస్తాబాదు గ్రామాల్లోని ఆయకట్టు భూములకు ప్రధాన కాల్వ, ఉప కాల్వల ద్వారా సాగునీరు అందితేనే ఈ ఏడాది రెండవ పంట సాగు జరుగుతుందని రైతులు అంటున్నారు. వరదల్లో కాల్వకు పడిన గండ్లు పూడ్చటం, కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడ, జమ్మిని తొలగించాలని రైతాంగం అడుగుతోంది.

పట్టించుకోని అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో రైతాంగం గొల్లపూడి కాల్వ మోటార్లు బాగు చేయాలని, కాల్వకు పడిన గండ్లు పూడ్చాలని అధికారులను అడుగుతున్నారు. అయితే అధికారులు ప్రభుత్వానికి తెలియజేస్తామని చెబుతున్నారే తప్ప.. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వరదలు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఏ ఒక్క గండి పూడ్చలేదు. తూటుకాడను తొలగించిన దాఖలాలు లేవు. వరదల పుణ్యమా.. అని ఖరీఫ్ పంట ముంపుతో నష్టపోయిన రైతాంగం రెండవ పంట సాగు చేస్తేనే కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంటుంది. కాల్వ ద్వారా సాగునీరు రాకపోతే పంటల సాగు ప్రశ్నార్థకమేనని రైతులు అంటున్నారు. అధికారులు కాల్వ మరమ్మతు పనులు ప్రారంభిస్తే తప్ప సీజనుకు సాగునీరు అందవనే అభిప్రాయాన్ని రైతాంగం వ్యక్తం చేస్తోంది.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వానికి మోటార్లు రిపేర్లు చేయడానికి, కాల్వ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

రవి, ఏఈ, ఏపీఐడీసీ

మోటార్లు రిపేర్లు చేయాలి



గొల్లపూడి పంట కాల్వ మోటార్లు పూర్తిగా వరదల్లో మునిగిపోయి పని చేయడం లేదు. మోటార్లు మరమ్మతులు చేసి నీరు తోడేవిధంగా రిపేర్లు చేయాలి. పాముల కాల్వ వద్ద సైఫన్ గోడ నిర్మించాలి.

–సొంగా దయాకర్, అంబాపురం గ్రామం

గండ్లు పూడ్చాలి



గొల్లపూడి కాల్వ శివారు భూములకు సాగునీరు అందించే విధంగా గండ్లు పూడ్చి నీరు విడుదల చేయాలి. కాల్వలో పెరిగిన తూటుకాడను యుద్ధప్రాతిపదికన తొలగించాలి.

–నలకుర్తి అబ్రహం, పాతపాడు గ్రామం

ఉత్సాహంగా సాక్షి స్పెల్ బీ పరీక్ష


కానూరు షామ్రాక్ పాఠశాలలో స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెనమలూరు: కానూరులోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం సాక్షి స్పెల్ బీ పరీక్షను విద్యార్థులు ఉత్సాహంగా రాశారు. కేటగిరి-1 పరీక్షలో 61 మంది, కేటగిరి- 2లో 51 మంది, కేటగిరి- 3లో 39 మంది, కేటగిరి-4 పరీక్షలో 6 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్పెల్ బీ పరీక్ష రాయడంతో ఆంగ్ల భాషపై పట్టు పెరుగుతుందని విద్యార్థులు తెలిపారు. సాక్షి ఎప్పుడు స్పెల్ బీ పరీక్ష నిర్వహించినా తమ పాఠశాల నుంచి పాల్గొంటామని విద్యార్థులు ఆనందంతో తెలిపారు.

క్లుప్తంగా

ప్రజా పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

పెనమలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పాలన అందించడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మార్నిడి బాబ్జి అన్నారు. కానూరులో గురువారం పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి పూర్తి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా సీనియర్ నాయకుడు ధనేకుల మురళీమోహన రావు నియమించినట్లు తెలిపారు.

జనావాసాల మధ్య వైన్‌షాపు తొలగించాలి

గన్నవరం: స్థానిక దావాజీగూడెం రోడ్డులో జనావాసాలు, స్కూల్, కళాశాల మధ్య ఏర్పాటు చేసిన వైన్‌షాపును వెంటనే తొలగించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు శ్రీనగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం, పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు గురువారం కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెయింట్‌జాన్స్ హైస్కూల్, చైతన్య జూనియర్ కళాశాలకు కేవలం వంద మీటర్ల లోపే మద్యం దుకాణం ఏర్పాటు చేశారని అన్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్ల మధ్యలో వైన్‌షాపు పెట్టడం వల్ల మహిళలు బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వైన్‌షాపు వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు



రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. రూరల్ మండలం రామవరప్పాడు ప్రధాన గ్రామంతోపాటు జాతీయ రహదారికి ఇరువైపులా పారుదలకు నోచుకుని డ్రెయిన్లలో గురువారం పూడిక తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయిన్లు పొంగి మురుగు రహదారులపైకి చేరుకుందని తెలిపారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లలో పూడిక తీయించినట్లు వివరించారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ఉయ్యూరు: కార్తిక మాసంలో పంచారామాలకు ఉయ్యూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఉయ్యూరు డిపో మేనేజర్ కెవిఎస్ఆర్‌కె. ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నవంబరు మూడు నుంచి నవంబరు 25 వరకూ ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. సూపర్ లగ్జరీ చార్జీ ఒక్కొక్కరికి రూ. 1,200, ఎక్స్‌ప్రెస్ రూ. 1,000గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7382893468, 8919366868 నంబర్లను సంప్రదించాలన్నారు. త్రిలింగ క్షేత్రాలైన మహానంది, యాగంటి, శ్రీశైలం క్షేత్రాలకు కూడా బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 51.90 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. వీఎం రంగా విగ్రహం వద్ద కల్వర్టు నుంచి వెస్ట్ ఎలిమెంటరీ స్కూల్ వరకు 436 మీటర్లు రోడ్డు నిర్మాణం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ తెలిపారు. పల్లె పండుగ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి రోడ్డు నిర్మాణానికి ఖర్చు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా గురువారం నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేశారు. విద్యార్థుల రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేసినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. నెలలో ప్రతి గురువారం ఈ విధంగా విద్యార్థులకు మాత్రలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పెనమలూరు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు మండల పరిధిలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ ఐదు నెలల పాటు ధాన్యం సేకరణకు టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేయడానికి మూడు పోస్టులు ఉన్నాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులని తెలిపారు. అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు.

కంకిపాడు: ఖరీఫ్ సీజన్-2024లో ధాన్యం సేకరణకు టెక్నికల్ అసిస్టెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ వి.భావన్నారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కుందేరు, కోలవెన్ను, ఉప్పలూరు, కంకిపాడు, గొడవర్రు, మంతెన గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్ల నియామకం జరగాల్సి ఉందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: వైద్యురాలి ఇంట్లో చోరీ జరగడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పోరంకి ఆదర్శ అపార్టుమెంట్‌లో వైద్యురాలు జి. రజిని కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే రజిని ఇంట్లో రూ. 3.50 లక్షలు కబోర్డులో ఉంచింది. బుధవారం రాత్రి సొమ్ము చూసుకోగా రూ. 3.50 లక్షల్లో రూ. 1.30 లక్షలు చోరీ అయ్యాయి. సొమ్ము పనిమనిషి చోరీ చేసి ఉండవచ్చనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: తాడిగడపలో చోరీ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. తాడిగడప వంతెన డౌన్ కార్మికనగర్‌కు చెందిన బానాల నాగార్జునకు అదే ప్రాంతంలో బడ్డీ కొట్టు ఉంది. ఈనెల 22వ తేదీన వ్యాపారం ముగించుకుని బడ్డీకొట్టుకు తాళం వేశాడు. అయితే బుధవారం వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు కొట్టు తాళాలు పగుల కొట్టి రూ. 20 వేలు విలువైన సిగరెట్ పెట్టెలు, ఇతర సామగ్రి చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాడీవేడిగా ఉయ్యూరు మున్సిపల్ సమావేశం


టీడీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే, బేగం

- టిడ్కో రుణాల నోటీసులపై ఆగ్రహం
- లబ్ధిదారుల పక్షాన గొంతెత్తిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- టీడీపీ సభ్యుల తీరుపై వైస్ చైర్మన్ సోలే మండిపాటు

ఉయ్యూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం వాడీవేడిగా సాగింది. టిడ్కో గృహాల లబ్ధిదారుల రుణాల మంజూరులో బ్యాంకర్ల వేధింపులపై వైఎస్సార్ సీపీ సభ్యులు ఫైర్ అయ్యారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అజెండాలోని అంశాలను కౌన్సిల్ ముందు ఉంచారు. పలు అభివృద్ధి, ప్రజల సమస్యలపై సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్ మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారుల రుణాల విషయంలో బ్యాంకర్లు వేధింపులకు పాల్పడుతున్నారని, రుణాలు కట్టాలని నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. బ్యాంకర్ల నుంచి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. అధికారులు సమాధానం చెప్పక ముందే టీడీపీ కౌన్సిలర్ పండ్రాజు సుధారాణి జోక్యం చేసుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. దీంతో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజల పక్షాన మాట్లాడుతుంటే ఎందుకు అడ్డుతగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ సోలే, మరో వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్ టీడీపీ సభ్యుల తీరుపై ధ్వజమెత్తారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ జోక్యం చేసుకుని వ్యక్తిగత దూషణలు, రాజకీయాలకు పోవద్దని సూచించడంతో వివాదం సమసింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి. హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ హైస్కూల్ ప్రాంతం , ఎస్‌టీబీఎల్ కాలనీ, ఊరచెరువు ప్రాంతం, పెదపులిపాక గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కానూరులో మహదేవపురం కాలనీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. మణికంఠ నగర్, సుజుకి షోరూమ్ ప్రాంతం, అశోక్‌నగర్, ఫరూక్‌నగర్, బందరు రోడ్డు, ఆటోనగర్ టెర్మినల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

గన్నవరం: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6వ తేదీలోపు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం ప్రజా సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ, యువత సమస్యలపై పనిచేసే శక్తి పీడీఎఫ్ ఎమ్మెల్సీలకు మాత్రమే ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి విజయం కోసం ప్రజాసంఘాల నేతలు పాటుపడాలని కోరారు. పలువురు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

4 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గ్రామ రెవెన్యూ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పి.నైనవరం గ్రామంలో శ్రీగాయత్రీ రైస్‌మిల్లు, శ్రీసత్యనారాయణ ఫ్లోర్ అండ్ రైస్ మిల్లు, ఎనికేపాడు గ్రామంలో వీరయ్య అండ్‌కో రైస్‌మిల్లు, కొత్తూరు తాడేపల్లి గ్రామంలో పార్వతీశ ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్‌మిల్లుల్లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని వీఆర్వో తెలిపారు. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించిన గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ, వార్డు సభ్యుడు గంపా శ్రీనివాసరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న వీఆర్వో అనిల్

కానూరులో జాతీయ ఆక్యుపంక్చర్ దినోత్సవం


కానూరులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మాకాల సత్యనారాయణ

పెనమలూరు: కానూరులో జాతీయ ఆక్యుపంక్చర్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎస్పా భారత్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆక్యుపంక్చర్ జీవన విధానమని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. వచ్చే నెల 16వ తేదీన ప్రపంచ ఆక్యుపంక్చర్ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో ఆక్యుపంక్చర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీని నియమించారు. ఎస్పా భారత్ అధ్యక్షుడు ఆలవాల రవి, ఉపాధ్యక్షుడు జ్యోతిరాజు, కన్వీనర్ కాశీమహంతి సునీత, కుమార స్వామి, శ్యామల పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో గురువారం ఆయన అధికారిక పర్యటన చేశారు. మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. వృద్ధులకు కళ్లజోళ్లు, పేదలకు పౌష్టికాహారం అందించారు. మధుమేహ వ్యాధి నిర్ధారణ ఉచిత పరీక్షల కూపన్లు పంచారు. ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి లయన్స్ క్లబ్ పర్యావరణం, డయాబెటిస్, చైల్డ్‌హుడ్ క్యాన్సర్, విజన్, రిలీవింగ్ హంగర్ కార్యక్రమాలను ప్రధానంగా ఎంచుకుందన్నారు. క్లబ్ సభ్యులు అందరూ ఆయా అంశాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, సుభాష్, రామకృష్ణ, చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండీ ఇస్మాయిల్, నెల్లి రాంబాబు, దీనవాహి ప్రసాద్, పొగిరి రాము, ఊర కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ శేషగిరి

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కంకిపాడు: క్యాన్సర్‌పై అవగాహన అవసరమని లయన్స్ ప్రతినిధి, క్యాన్సర్ అవగాహన జిల్లా కోఆర్డినేటర్ బొబ్బా హరినాథ్, కె. నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గొడవర్రు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన చాలా ముఖ్యమన్నారు. ఆహార అలవాట్లు మార్చుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి అని సూచించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా అదనపు కార్యదర్శి ఎం. గోవిందరావు, హెచ్‌ఎం. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, లయన్స్ ప్రతినిధులు

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

కంకిపాడు: ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీల అధికారులు సూచించారు. మండలంలోని వేల్పూరు, కోలవెన్ను, దావులూరు సచివాలయాల్లో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహించారు. శిబిరాలను ఎంపీడీఓ పి. అనూష పర్యవేక్షించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కేంద్రాల్లో గ్రామస్తులు ఆధార్ నమోదు చేయించుకున్నారు.


కోలవెన్నులో ఆధార్ నమోదు శిబిరం

235 మందికి వైద్య పరీక్షలు



పెనమలూరు: కానూరులో గురువారం 235 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, గొల్లపూడి ఆంధ్ర ఆస్పత్రి, దహిత డెంటల్ కేర్, అమరావతి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన కళాశాలలో వైద్య శిబిరం జరిగింది. కంటి, దంత, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ అచ్యుతబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


ఉప్పలూరు గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భావన్నారాయణ

కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వి. భావన్నారాయణ తెలిపారు. భూముల రీసర్వేపై ఉప్పలూరు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సభలో గ్రామస్తులు 48 అర్జీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో నెలకొన్న వ్యత్యాసాలు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామసభల్లో వచ్చిన అర్జీలను 15 రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. భూ యజమానులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమగ్ర రీ సర్వేలో దొర్లిన తప్పులను సవరించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారని బాపులపాడు తహసీల్దార్ వి. నాగభూషణం తెలిపారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో భూ సమస్యల పరిష్కారానికి గురువారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. రీ సర్వే పూర్తి అయి పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఎల్‌పీ నంబర్లు, ఎఫ్‌ఎంబీకి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కోరారు. రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను వెంటనే సరిదిద్దుతామని అన్నారు. అనంతరం రైతుల నుంచి రెవెన్యూ అధికారులు వినతి పత్రాలను స్వీకరించారు. మండల సర్వేయర్ ఫణికుమార్, వీఆర్వో సీమోను, గ్రామ సర్వేయర్ కాకుల సుష్మ పాల్గొన్నారు.